క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైభవంగా బీరప్ప బోనాలు


పోతరాజుల విన్యాసం

యాచారం: మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం బీరప్ప బోనాలు వైభవంగా జరిగాయి. కుర్మ కులస్తులు దేవతామూర్తులకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ లింగయ్య బందోబస్తును పర్యవేక్షించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

యాచారం: బాల్య మిత్రుడు మృతితో ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం చేసి దాతృత్వం చాటుకున్నాడు నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజునాయక్. నందివనపర్తి గ్రామంలోని తన చిన్న నాటి బాల్య మిత్రుడు నాగటి గోపాల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో రాజునాయక్ నందివనపర్తి గ్రామంలో గోపాల్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల సహాయం అందజేశాడు. భవిష్యత్‌లో ఎలాంటి సహాయమైనా చేస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

మజీద్‌పూర్ బీజేపీ కమిటీ ఎన్నిక


సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ మజీద్‌పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గడ్డం వెంకటేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం గ్రామంలో పార్టీ జిల్లా నాయకులు వడ్డేపల్లి పాపయ్యగౌడ్, బొడిగె గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్‌ను, పీర్లగూడెం అధ్యక్షుడి గా సిల్వేరు రాంబాబును నియమించినట్లు వా రు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు శ్రావణ్‌చారి, సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు నాగరాజు, నర్సింహగౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాఘవులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై అవగాహన, కార్యచరణపై నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

పార్కు స్థలాల అభివృద్ధికి కృషి: కార్పొరేటర్

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ ఫ్రీడమ్ పార్కులో అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఆదివారం కాలనీ వాసులతో కలసి కార్పొరేటర్ పార్కును పరిశీలించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముదువు సందీప్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకులు ధీరజ్‌రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో వివిధ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోఆరరు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంత రాములు యాదవ్ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు జాగేదీ?

- మైదానాలకు నోచుకోని జల్‌పల్లి మున్సిపాలిటీ
- శ్రీరాంకాలనీలో నామ్‌కే వాస్తేగా మైదానం
- క్రీడలకు దూరమవుతున్న యువత



శ్రీరాంకాలనీలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో క్రీడా మైదానాలు లేక యువత ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారి వ్యాయామం, వివిధ రకాల ఆటలాడుకునే క్రీడాకారులకు నిరాశ తప్పడం లేదు. గ్రౌండ్స్ లేక ప్రైవేట్ భూముల్లో ఆడుకోవాల్సి వస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు. గతేడాది పహాడీషరీఫ్‌లో కుస్తీ పోటీల కోసం నిర్వాహకులు పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. పోలీస్ గ్రౌండ్‌లో కుస్తీలకు అనుమతి ఇవ్వకపోవడంతో.. చివరి క్షణంలో ప్రైవేట్ స్థలాన్ని ఎంచుకోవాల్సి వచ్చింది.

పేరుకే క్రీడా ప్రాంగణం..

మున్సిపాలిటీ పరిధిలోని మూడు ప్రైవేట్ వెంచర్లలో మున్సిపాలిటీకి కేటాయించిన స్థలంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే శ్రీరాం కాలనీలోని నిధి వెంచర్‌లో గతేడాది ఆగస్టు 3న రెండు వేల గజాల స్థలానికి సంబంధించి 'క్రీడా ప్రాంగణం' బోర్డును ఏర్పాటు చేసి.. చుట్టూ 380 మొక్కలను నాటారు. ఈ స్థలంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, స్కేటింగ్ తదితర గ్రౌండ్‌లను నిర్మిస్తామన్నా అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటి వరకు కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు..

ఓపెన్ జిమ్‌తో ప్రయోజనం అంతంతే..

జల్‌పల్లి గ్రామ శివారులోని గ్రీన్‌హోం వెంచర్‌లో ఉన్న ఓపెన్ జిమ్‌తో ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంది. అన్ని మున్సిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు 2019 ఫిబ్రవరి మాసంలో జల్‌పల్లిలోని గ్రీన్‌హోం వెంచర్‌లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ జిమ్‌కు కొంత మంది యువకులు మాత్రమే ఉదయం పూట వెళ్లి వ్యాయామం చేస్తున్నారు.

బుట్ట దాఖలవుతున్న విన్నపాలు..

మున్సిపాలిటీ పరిధిలో యువత కోసం ప్రభుత్వ భూములను మైదానాల కోసం కేటాయించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం. ఇన్నాళ్ల పాటు పహాడీషరీఫ్‌లోని ఇజ్తెమా గ్రౌండ్, జల్‌పల్లి మంచు టౌన్‌షిప్ రోడ్డులోని ప్రైవేట్ స్థలాల్లో ఆడుతూ వచ్చారు. కానీ, ప్రస్తుతం నిర్మాణ రంగం ఊపందుకొని ఖాళీ స్థలాలే కనిపించకుండా పోయాయి. కావునా, ప్రభుత్వం తరపున క్రీడా మైదానాలను కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. ఏడాదికోసారి క్రికెట్, వాలీబాల్ లాంటి టోర్నమెంట్లు నిర్వహించాలంటే మైదానాలు లేక ప్రైవేట్ భూములను ఆశ్రయిస్తూ చీదరింపుల పాలవ్వాల్సి వస్తుంది.

స్థలాన్ని కేటాయించాలి



జల్‌పల్లిలోని యువత ఆటలు ఆడేందుకు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. కానీ, చూద్దామన్నా ఎక్కడ కూడా మైదానాలు లేవు. ప్రతి ఏటా జల్‌పల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌ను మంచు టౌన్ షిప్ రోడ్డులోని ప్రైవేట్ భూమిలో ఆడుతున్నాం. మైదానం ఏర్పాటు విషయమై ఏళ్ల తరబడిగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. – శ్రీకాంత్ గౌడ్, జల్‌పల్లి

సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ అహ్మద్ కసాది


కౌన్సిలర్ అహ్మద్ కసాదిని సన్మానిస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న కౌన్సిలర్ అహ్మద్ కసాదిని స్థానిక కాలనీల ప్రజలు ఆదివారం సన్మానించారు. కాలనీలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వరదనీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి సబితాఢ్డి రూ.10 కోట్లతో డ్రైయిన్‌బాక్స్ నిర్మాణం చేయించారు. దీంతో పాటు భూగర్భ డ్రైనేజీ పనులు కూడా చేపడుతుండటంతో ఇకపై కాలనీలో సమస్యల చింత ఉండబోదని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ...మంత్రి సబితారెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చైర్మన్ అబ్దుల్లా సాదీ, ఎంఐఎం ఇన్‌చార్జి అహ్మద్ సాదిల సహకారంతో మూడో వార్డులో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నెలల తరబడిగా నీటిలో మునిగిన రహదారులకు డ్రైయిన్ బాక్స్ నిర్మాణంతో విముక్తి కలగనుందన్నారు.

'వాలీబాల్' విజేతగా బైరాగిగూడ టైగర్స్


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫైనల్ పోటీలో ప్రథమ స్థానంలో బైరాగిగూడ టైగర్స్, ద్వితీయ స్థానంలో బైరాగిగూడ కింగ్స్ జట్లు నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు ఇంద్రారెడ్డి ట్రస్ట్ తరపున గ్రామానికి చెందిన పలుస శివప్రసాద్‌గౌడ్ రూ.11 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు ఎండీ.దావూద్ రూ.6 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. ప్రతి ఒక్కరూ క్రీడల కోసం సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో విజేత జ ట్ల కెప్టెన్లు పండాల రమేష్, పలుస శివ, నాయ కు లు ఎండీ.సర్వర్, సయ్యద్ ఇమ్రాన్, అందుగుల స త్యనారాయణ, భగవంత్, పి.ప్రణీత్‌కుమార్, యా చారం మైసయ్య, వెంకటేష్, సాయిబాబా, బాబురావు, జంగయ్య, ఆయూబ్, రమేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్ ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఉప సర్పంచ్ నర్సింగ్

మహేశ్వరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమీర్‌పేట్ ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన ఐదుమంది లబ్ధిదారులకు రూ.2.1 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. పేదలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని ఆర్థిక సహాయం కోసం స్థానిక ఎమ్మెల్యే వద్ద సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేకోవాలన్నారు. పేదల సంక్షేమం కోసం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అమీర్‌పేట్ గ్రామానికి చెందిన పసునూరి రమేష్ చారి రూ.60 వేలు, డప్పు కన్యాకుమారి రూ.55 వేలు,చాకలి అంజమ్మ రూ.40 వేలు, డప్పు కిష్టమ్మ రూ.35 వేలు, వీరసింహకు రూ.11 వేల రూపాయాల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పెంటల రాయప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తపల్లి దేవరం గౌడ్,బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెంటల వెంకటేష్, నాయకులు మచ్చెందర్, శ్రీరాములు ఎర్ర రవి, కర్రె కుమార్ పలువురు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి

మంత్రి సబితారెడ్డి

- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌ల్లో రూ.4.22 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు ముఖ్యఅతిధిగా మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వరదనీటి కాల్వ నిర్మాణం, ప్రధాన రోడ్ల విస్తరణ, మిషన్ భగీరథ మంచినీటి పైప్ లైన్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్‌లు, ముఖ్యంగా వైకుంఠధామాలు ఇలా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. దీంతో మహేశ్వరం నియోజకవర్గంతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్లు స్వప్న, పి.శోభ, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.అర్జున్, అనిత, పి.సుదర్శన్‌రెడ్డి, భారతమ్మ, మమత, ఏ.రాంరెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే విజయం

చల్లా నర్సింహా రెడ్డి


నర్సింహారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయిలు

పహాడీషరీఫ్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ హుస్సేన్ యెమానీ తన అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి చల్లా నర్సింహారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, అమరేందర్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడంలో మంత్రి సబితారెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. గతంలో పేదలకు రాజీవ్ గృహకల్ప ఇళ్లు ఇచ్చినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేకపోతుందన్నారు. తెలంగాణలో కర్నాటక ఫలితాలే పునరావృతం కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగేటి మధుసూదన్‌రెడ్డి, అహ్మద్ బామ్, అఫ్జల్, షరీఫ్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా, యూసుఫ్ ఖాద్రీ, బారీ పాల్గొన్నారు.

మొగులయ్యకు ఘన సన్మానం


మొగులయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కడ్తాల్: కిన్నెర కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్యను ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సీనియర్ సెకండరీ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సీనియర్ సెకండరీ పాఠశాలను ఆదివారం మొగులయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లితో పాటు, ఉపాధ్యాయులు మొగులయ్యను ఘనంగా సత్కరించారు. మొగులయ్య పద్మశ్రీ అవార్డు అందుకోవడంతో ఉమ్మడి పాలమూర్ జిల్లాతో పాటు, రాష్ట్రానికి గొప్ప పేరు, ప్రఖ్యాతులు తీసుకువచ్చారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, శివ, సుజిత, రవిశంకర్, వాసు తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

తలకొండపల్లి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్, ఉపసర్పంచ్ అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో పదోతరగతి చదివిన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు స్థానికంగా, పట్టణాల్లోని ప్రైవేట్ కాలేజీల్లో ఉన్నత చదువులు చదువుతున్నారని.. ఆర్థికంగా వెనుకబడినవారు మాత్రం ఫీజులు కట్టలేక పదోతరగతితోనే చదువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలున్నాయని.. తలకొండపల్లి మండల కేంద్రంలో నేటికీ జూనియర్ కళాశాల లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు పిల్లల భవిష్యత్‌పై ఆలోచన లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదన్నారు. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు అధిక నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి తలకొండపల్లి మండల కేంద్రం కన్పించడం లేదా అని మండిపడ్డాడు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని.. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి


కోమటిరెడ్డితో అయ్యవారిగూడెం పాలకవర్గం

యాచారం: భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో అయ్యావారిగూడెం సర్పంచ్ గంగా లచ్చిరాంనాయక్, ఉపసర్పంచ్ మహేందర్ యాదవ్ కలిశారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.20లక్షల నిధులు అడుగగా మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. వార్డు సభ్యులు మోతీలాల్, పాండరి, వెంకటయ్య, నేనావత్ లచ్చా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య కోరారు. తుర్కయంజాల్‌లో ఆదివారం ప్రజాగర్జన వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజ, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు తదితరులు పాల్గొననున్న ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

కౌన్సిలర్ మంగమ్మ

తుర్కయంజాల్: మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం ఈషాన్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ ఆదివారం ప్రారంభించారు. శిబిరంలో రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ శివకుమార్, కందాల నరేందర్ రెడ్డి, డాక్టర్లు ప్రశాంత్, చందన తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి: సీపీఐ

మంచాల: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడైపోయిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నేత శ్రీశైలంయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మంచాలలో ఆయన మాట్లాడుతూ.. మంచాల మండలంలోని ఆగాపల్లి–జాపాల, మంచాల–జాపాల, ఆరుట్ల–బండలేమూర్ రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం రోడ్ల బాగు కొరకు అధికంగా నిధులు కేటాయించినట్లు పేర్కొంటుంది. గ్రామాల్లో మాత్రం రోడ్లు ఏళ్లు గడిచినా బాగుచేసే నాథుడు లేడని వాపోయారు. తక్షణమే రోడ్లను బాగుచేయాలని కోరారు.

రోడ్డుపై మురుగు పరుగు..


శ్రీరాంకాలనీ రహదారిపై మురుగు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీలో రోజుల తరబడిగా మురుగునీరు రోడ్లపై పారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసం స్థానిక కౌన్సిలర్లు సైతం స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాంకాలనీని ఆనుకొని ఉన్న పారిశ్రామికవాడకు వచ్చిపోయే భారీ వాహనాలతో ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయంగా మారడంతో రెండేళ్ల క్రితం రూ.50 లక్షల వ్యయంతో నూతన రోడ్డు వేశారు. అయితే తరచూ మురుగు రోడ్డుపై పారుతుండటంతో రహదారి సైతం రోజురోజుకు పాడవుతోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరిద్దాం

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడానికి చేపట్టిన మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మండల, మున్సిపల్ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచారి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతోందన్నారు. ఈ 9 ఏళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రజల కోసం అమలుచేస్తున్న పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కూడా అధికారమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు నిర్వహించే మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ వెంకటయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్


అబ్దుల్లాపూర్‌మెట్: క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్ పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామంలో ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొడూరి రమేష్ ఆధ్వర్యంలో తులేకలాన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, యువనేత అభిషేక్‌రెడ్డితో కలిసి జెడ్పీటీసీ మాట్లాడారు. యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలని కోరారు. ఏ రంగంలోనైనా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి..

అబ్దుల్లాపూర్‌మెట్: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు తాను స్వయంగా రూ.25వేల నగదు పురస్కారాన్ని అందజేస్తానన్నారు. నాయకులు జంగారెడ్డి, రామ్‌రెడ్డి, తిరుమలరెడ్డి,ప్రదీప్ రెడ్డి, రాజు మరియు ఆర్గనైజర్లు వంశీ,వినోద్, వంశీ, శ్రీకాంత్, క్రీడాకారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.